యూపీఎస్ పింఛన్ విధానం రద్దు చేయాలి

బోథ్, జనవరి 27: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూపీఎస్ పింఛన్ విధానాన్ని రద్దు చేయాలని పీఆర్టీయూ టీఎస్ నాయకులు సోమవారం బోథ్ తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ విధానం మూలంగా ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఇక్కడ మండల శాఖాధ్యక్షుడు ఆర్టీవీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సంగు స్వామి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బిక్క గంగయ్య, డీ గంగయ్య, ఆర్ రవిరాజ్ ఉన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

దస్తురాబాద్, జనవరి 27 : యువత చెడు దారి పట్టకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకొని,క్రీడల్లో రాణించాలని నాయకులు, దాతలు అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని రాంపూర్ గ్రామంలో దస్తురాబాద్ ఫ్రెండ్స్ స్పోర్ట్స్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో దాతలు, నాయకులు నిమ్మతోట శివయ్య, గాజర్ల రాజేశం, కొడిమెల రాములక్ష్మణ్, రాజునాయక్, క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

భైంసా, జనవరి 27 : ముధోల్ నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రోడ్ల నిర్మాణానికి రూ.7 కోట్ల 80 లక్షల నిధులు మంజూరైనట్లు ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. తానూర్ – హుండా రోడ్డుకు రూ.5 కోట్ల 90 లక్షలు, కుంటాల – దౌనెల్లి మహారాష్ట్ర సరిహద్దు వరకు రూ. కోటి 90 లక్షలు నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

భైంసా, జనవరి 27: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని కళాశాల ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లా భైంసాలోని గోపాల్ రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో క్రికెట్, ఖోఖో, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఓం ప్రకాశ్, అధ్యాపకులు రఘునాథ్, భీంరావ్, పవన్ కుమార్, పీజీ రెడ్డి, రవికుమార్, శంకర్, సుధాకర్, సంతోష్, కల్పన, దివ్య, శ్రావణ్య, రాజయ్య పాల్గొన్నారు.

పాఠశాలలో మౌలిక సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్ అర్బన్, జనవరి 27 : నిర్మల్‌లోని శాంతినగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కాలనీ వాసులు డీఈవో రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కొండాజి రాఘవేంద్రచారి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడ ఉపాధ్యాయులను నియమించాలని, పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణం చేపట్టాలని కోరారు. ఇక్కడ గంగాధర్, సురేశ్, రమేశ్, మహేశ్, మారుతి ఉన్నారు.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను నియమించాలి

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 27: నిర్మల్‌లోని ప్రభుత్వ దవాఖానలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను నియమించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సిర్ర దేవేందర్ అన్నారు. సోమవారం కార్మికులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దవాఖానలో ఔట్ సోర్సింగ్ కార్మికులను నియమించకపోవడంతో ప్రస్తుతం ఉన్న కార్మికులపై పనిభారం పెరిగిందన్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి కార్మికులను నియమించాలని కోరారు. ఇక్కడ నాయకులు పుష్ప, పద్మ, లక్ష్మి రాజమణి, రాజు ఉన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

● ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఎదులాపురం: అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఎదులాపురం, జనవరి 27 : ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి సూచించారు. సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీలను పరిశీలించిన అదనపు కలెక్టర్ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలోవివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ప్రజావాణి

ఇచ్చోడ(సిరికొండ), జనవరి 27: ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో రవీందర్ అన్నారు. సోమవారం సిరికొండలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి సమాచార సహాయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలకు ఏ సందేహాలున్న ప్రజావాణిలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ జైపాల్, మండల ప్రజా పరిషత్ సిబ్బంది సంతోష్, విమల బాయి, వినోద్ పాల్గొన్నారు.

బోథ్, జనవరి 27: బోథ్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిని ఎంపీడీవో రమేశ్ ప్రారంభించారు. ప్రతి సోమవారం ప్రజావాణిలో ప్రజల నుంచి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. పింఛన్లు, ఇళ్ల తదితర వాటి కోసం వచ్చే దరఖాస్తులను స్వీకరించి రసీదులు అందించనున్నట్లు పేర్కొన్నారు. సాధ్యమైనవాటిని పరిష్కరించడంతో పాటు తిరస్కరించిన వాటి గురించి దరఖాస్తుదారులకు కారణాలు తెలియజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజేశ్వర్, ఎంపీవో అతుల్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ ప్రభు లింగం, జూనియర్ అసిస్టెంట్లు సంతోష్ రెడ్డి, వనమాల పాల్గొన్నారు.

ఎదులాపురం,జనవరి 27 : ఆదిలాబాద్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రారంభమైన ప్రజావాణిలో తహసీల్దార్ గోవింద్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండల వ్యాప్తంగా ఐదు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఇందులో రేషన్ కార్డు మూడు, రైతు భరోసా సంబంధించిన రెండు అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో స్వప్నశీల, ఆర్ఐ నారాయణ, జూనియర్ అసిస్టెంట్ గజానంద్ పాల్గొన్నారు.

నార్నూర్, జనవరి 27 : నార్నూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిని ఎంపీడీవో జవహర్‌లాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శి సాయిప్రసాద్, సూపరింటెండెంట్ రాథోడ్ గంగసింగ్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి, జనవరి 27 : ఇంద్రవెల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కౌంటర్ వద్ద ఎంపీడీవో భాస్కర్ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు నుంచి అర్జీలు స్వీకరించారు. అధికారులు శాఖల వారీగా సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

తలమడుగు, జనవరి 27 : తలమడుగులోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదు విభాగంలో ఎంపీడీవో చంద్రశేఖర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజుమోహన్, మండల వ్యవసాయ శాఖాధికారి ప్రమోద్ రెడ్డి, కిసాన్ మిత్ర కోఆర్డినేటర్ మేకల రమాకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

సామ వెంకట్ రెడ్డితో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, జనవరి 27 : ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని కూర గ్రామానికి చెందిని సామ వెంకట్ రెడ్డి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. సోమవారం ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న వారి ఇంటికి వాళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

10.725 కిలోల గంజాయి దహనం

దహనం చేసేందుకు తీసుకువచ్చిన గంజాయి

ఇచ్చోడ, జనవరి 27: ఇచ్చోడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ 2 కిలోల 469 గ్రాములు, ఉట్నూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ 7.9 కిలోల గంజాయి, 356 గంజాయి మొక్కలను దహనం చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జుల్ఫీకర్ అహ్మద్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి వద్ద గల శ్రీ మెడికేర్ సర్వీసెస్ సెంటర్‌కు తరలించి అక్కడ ఎలక్ట్రిక్ యంత్రంలో వేసి దహనం చేసినట్లు పేర్కొన్నారు.

అర్జీలు స్వీకరించి.. పరిష్కారానికి ఆదేశించి..

అర్జీలు స్వీకరిస్తున్న ఏపీవో జనరల్ వసంత్‌రావ్

ఉట్నూర్, జనవరి 27 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహించారు. ఏపీవో జనరల్ వసంత్‌రావ్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం మల్కాగూడ గ్రామానికి చెందిన కొడప మారు తన పొలానికి త్రీఫేజ్ విద్యుత్ ఇప్పించమని, దహెగాం గ్రామానికి చెందిన పోచమ్మ బోర్‌వెల్, లక్కారం గ్రామానికి చెందిన గేడం దేవ్‌రావ్ టెంట్ హౌజ్‌కు లోన్ మంజూరు చేయాలని, పలు సమస్యలపై అర్జీలు కోరారు. కార్యక్రమంలో ఏపీవో పీవీటీజీ మెప్రా మనోహర్, పీహెచ్‌వో సందీప్ కుమార్, ఏవో దామోదర్ స్వామి, పెసా కోఆర్డినేటర్ వసంత్‌రావ్, మేనేజర్ నాగభూషణం, డీపీవో ప్రవీణ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాగోబా జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

ఇంద్రవెల్లి, జనవరి 27: ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబా జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు.సోమవారం నాగోబా ఆలయంతో పాటు జాతర ఏర్పాట్లను మాజీ ఎంపీ సోయం బాపురావ్, మెస్రం వంశీయులతో పాటు అధికారులతో కలిసి పరిశీలించారు. జాతరకు పలువురు మంత్రులు రానున్నట్లు తెలిపారు. దానికి అనుగుణంగా పోలీసుల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అధికారులు భక్తులకు ఎలాంటి సమస్యలు రాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మర్రిచెట్ల వద్ద మెస్రం వంశీయులతో పూజలతో పాటు వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, నాగోబా ఆలయ చైర్మన్ మెస్రం ఆనంద్‌రావ్, ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, మెస్రం వంశీయులు శేఖర్‌బాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భైంసా, జనవరి 27 : నిర్మల్ జిల్లా భైంసాలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ శాఖ చేపట్టే పనుల్లో భాగంగా 33/11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా నిర్మల్ రోడ్డు, ఓవైసీ నగర్, రాజీవ్ నగర్, మోమినామ్ గల్లి, ఏక్‌మినార్, మదీనా కాలనీ, పల్సి పీడర్, స్పిన్నింగ్ మిల్ పీడర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 5 గంటల వరకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన

జైనథ్, జనవరి 27: జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఎస్సై పురుషోత్తం సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, హెల్మెట్ తప్పకుండా ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడుపవద్దన్నారు. అతివేగంగా, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ కాంట్రాక్టు ఉద్యోగుల ఆందోళన

ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ముధోల్, జనవరి 27 : నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ఐటీలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆందోళన బాట పట్టారు. ట్రిపుల్ఐటీ ప్రవేశ ద్వారం వద్ద నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు.యూజీసీ పేస్కేల్‌తో కూడిన గౌరవ వేతనం అందించాలని, బేసిక్ డీఏ హెచ్ ఆర్ఏతో పాటు 3శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని అసిస్టెంట్ ప్రొఫెసర్లు డిమాండ్ చేశారు. తమ సమస్యలు తీర్చకుండా నియామకాలకు వెళ్లితే ఆందోళనలు ఉధృతం వారు హెచ్చరించారు.

కంది రైతు పంట కొనుగోలు పరిమితి పెంపు

భైంసా, జనవరి, 27: కంది పంట ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ద్వారా పరిమితి పెంచడం జరిగిందని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. ముందు ఎకరానికి 3 క్వింటాళ్ల 30 కిలోలు కొనుగోలు చేయాలని పరిమితి ఉండడంతో రైతుల విజ్ఞప్తి మేరకు వ్యవసాయ శాఖ కమిషనర్‌తో మాట్లాడి ఎకరానికి 6 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని ఆదేశాలు వచ్చాయని ఆయన తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

మానవత్వం చాటుకున్న అధికారులు

ముధోల్, జనవరి 27: నిర్మల్ జిల్లా ముధోల్ మండలంలోని ఆష్టా గ్రామంలో రెండు రోజుల క్రితం తల్లిని కొడుకు చంపడంతో నిందితుని పిల్లలు అనాథలుగా మారారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శివకుమార్ తన సిబ్బందితో సోమవారం అనాథ పిల్లల పరిస్థితిని చూసి వారికి చేరో రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే రేషన్ కార్డుల ఇబ్బందుల విషయంలో అక్కడే పరిష్కరించి కార్డు అందజేయడంతో పాటు 25 కేజీల బియ్యాన్ని ఇప్పించడం, ఇందిరమ్మ ఇల్లు సైతం అందజేస్తామని చెప్పారు. పిల్లల చదువుపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సహకారాలు అందిస్తామన్నారు. ఇక్కడ నాయకుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సుకన్యరమేశ్, అధికారులు ఉన్నారు.

మున్సిపల్ ప్రత్యేకాధికారిగా ఫైజాన్ అహ్మద్

మున్సిపల్ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఫైజాన్ అహ్మద్

భైంసా, జనవరి 27: నిర్మల్ జిల్లా భైంసా మున్సిపల్ ప్రత్యేకాధికారి అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సోమవారం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ పాలక వర్గాలకు గడువు ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. బాధ్యతలు స్వీకరించడంతో కమిషనర్ రాజేశ్ కుమార్, మున్సిపల్ సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించారు.

నిర్మల్ అర్బన్, జనవరి 27: నిర్మల్ మున్సిపల్ పాలక వర్గం గడువు ముగిసిపోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడారు. మున్సిపాల్టీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సహకరించాలని అన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఉద్యోగులకు విధి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ హరిభువన్, పట్టణ ప్రణాళిక అధికారి హరీశ్, ఆర్వో అనూఫ్, పీడీ సుభాష్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నమూనా నిర్మాణానికి భూమిపూజ

ఉట్నూర్, జనవరి 27 : ఉట్నూర్‌లోని తహసీల్ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ ఇళ్ల నమూనా నిర్మాణానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఉట్నూర్ రూరల్, జనవరి 27: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామసభలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యత కల్పించి సమస్యలు పరిష్కరించి, పథకాలు అందించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్, ఏఎంసీ వైస్‌చైర్మన్ జైవంత్‌రావ్, ఏపీవో రజినీకాంత్, ఏఈవో సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శి, ఆర్‌టీఏ కమిటీ సభ్యుడు రాజేశ్వర్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

జైనథ్, జనవరి 27: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని మాంగుర్ల, ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న కుకటి రాజన్న అనే ఉపాధ్యాయుడు ఆ పాఠశాల విద్యాభివృద్ధికి తనవంతుగా రూ.10 వేలు ఆర్థిక సాయం అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, మాజీ సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు, యువకులు, ప్రధానోపాధ్యాయులు రవీందర్ గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కుంటాల, జనవరి 27: నిర్మల్ జిల్లా కుంటాల మండలం అందకూర్ గ్రామ సర్పంచ్ కొత్తపల్లి బుచ్చన్న తల్లి నర్సమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను సోమవారం బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్ రెడ్డి, ముధోల్ సమన్వయ కమిటీ సభ్యుడు విలాస్ గాదేవార్, మాజీ ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి పరామర్శించారు. వారి వెంట బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తు, మాజీ సర్పంచ్ దాసరి కిషన్, రవి, నిర్మల్ ఏఎంసీ డైరెక్టర్ మురళి ఉన్నారు.

నార్నూర్, జనవరి 27 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని మలంగితండాకు చెందిన జాదవ్ ఇందల్ అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను సోమవారం ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్ పరామర్శించారు. ఆయన వెంట నార్నూర్ సహకార సంఘం చైర్మన్ సురేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మెస్రం హన్మంత్‌రావ్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసీం, పట్టణ అధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్, ఉపాధ్యక్షుడు శివాజీ, నాయకులు సుల్తాన్‌ఖాన్, అలంఖాన్ ఉన్నారు.

పది పరీక్షలపై దృష్టి సారించాలి

ముధోల్, జనవరి 27 : విద్యార్థులు రానున్న పది పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో రమణ రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా ముధోల్‌లోని రబీంద్ర పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ సాయినాథ్ ఉన్నారు.

ఘనంగా తూమ్ పూజలు

నైవేద్యాలు సేకరిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి, జనవరి 27: పవిత్ర గంగాజలంతో మర్రిచెట్ల వద్ద కుటుంబసమేతంగా బస చేస్తున్న మెస్రం వంశీయులు ఆదివారం రాత్రి సంప్రదాయ ప్రకారం 93 మంది పేరిట తూమ్ పూజలు నిర్వహించారు. అనంతరం మర్రిచెట్లకు కొద్ది దూరంలో అర్ధరాత్రి పతిభ గవాన్ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, బాజీరావ్‌పటేల్, లింబారావ్‌పటేల్, కోసు కటోడ, కటోడ కోసేరావ్, కటోడ హనుమంత్‌రావ్, దాదారావ్, నాగోబా పేన్ తిరుపతి, నాయిక్‌వాడీ ధర్ము, మెస్రం వంశీయులు పాల్గొన్నారు.

ఓటమి విజయానికి నాంది కావాలి

నార్నూర్, జనవరి 27 : క్రీడల్లో ఓటమి విజయానికి నాందిగా మలుచుకోవాలి తప్ప కుంగిపోవద్దని వక్‌బోర్డు మాజీ చైర్మన్ యూన్సీఅక్బానీ, మాజీ జడ్పీటీసీ రూపావతి జ్ఞానోబా పుష్కర్ అన్నారు. జాతర సందర్భంగా నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ తొడసం నాగోరావ్, సహకార సంఘం చైర్మన్ సురేశ్, మాజీ వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, జేఏసీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, మాజీ సర్పంచ్‌లు మడావి రూప్‌దేవ్, సాగర్, పరమేశ్వర్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు పూసం ఇస్రూ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మెస్రం హన్మంత్‌రావ్, లోకండే చంద్రశేఖర్, సయ్యద్‌ఖాసీం, ఫడ్ విష్ణు, అలంఖాన్, ఆలయ కమిటీ నిర్వాహకులు రాజు, మోతీరాం, ఆనంద్‌రావ్, గజేందర్ పాల్గొన్నారు.

స్టేట్ పోలీస్ మీట్‌కు పోలీసులు ఎంపిక

పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్ అర్బన్, జనవరి 27 : నిర్మల్ జిల్లాకు చెందిన 16 మంది పోలీసులు ఇటీవల నిర్వహించిన స్పోర్ట్స్‌మీట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. స్టేట్ మీట్‌కు వెళ్తున్న పోలీసులను సోమవారం ఎస్పీ కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరీంనగర్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి నిర్మల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఏఎస్పీ రాజేశ్ మీనా, స్పోర్ట్స్ టీం సిబ్బంది ఉన్నారు.

పోలీసుల సేవలను వినియోగించుకోవాలి

నిర్మల్ అర్బన్, జనవరి 27: ప్రజలు పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. నిర్మల్‌లోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఫిర్యాదుల విభాగంలో పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

ఆర్టీసీ బస్సును ఢీ కొన్న కారు

నర్సాపూర్ (జీ), జనవరి 27: ఆర్టీసీ బస్సును కారు ఢీ కొన్న ఘటన సోమవారం నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ)లో చోటు చేసుకుంది. ఎస్ఐ సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. నందన్ ఎక్స్ రోడ్డు దగ్గర నిర్మల్ నుంచి భైంసాకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును దేగాం గ్రామానికి చెందిన విశాల్ కారు అతి వేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ఢీ కొంది. దీంతో బస్సు కుడివైపు భాగంగా కొంత మేర దెబ్బతింది. ఆర్టీసీ డ్రైవర్ లింగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

గంధం సంతోష్

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 27 : నిర్మల్‌లోని బైల్‌బజార్, గాంధీనగర్‌కు చెందిన గంధం సంతోష్(38) వృత్తి వ్యాపారం చేసుకుని ఉపాధి పొందుతున్నాడు. 18 నవంబర్ 2024 నుంచి కనబడడం లేదు. కుటుంబ సభ్యులు నిర్మల్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. వ్యక్తి ఆచూకీ లభిస్తే సెల్ నంబర్లు 8712659511, 8712659512కు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

31న విద్యాసంస్థలకు సెలవు

ఎదులాపురం, జనవరి 27 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతర ప్రజా దర్బార్‌ను పురస్కరించుకుని ఈ నెల 31వ తేదీన విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఈ సెలవు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు వర్తిస్తుందని పేర్కొన్నారు.